# బడి గంటలు

ఆ రోజు ఆగస్టు 15, భరతమాత బానిసత్వాన్ని తరిమివేసి స్వరాజ్యం పొందిన రోజు. ఊరంతా హడావిడిగా ఉంది. అనేక చోట్ల ముందు రోజే రంగురంగుల కాగితాలు జాతీయ జెండాల్లా తయారు చేసి అంటించి తోరణాలు కట్టారు. ఆ రోజు ప్రాతఃకాలం నుంచే మైకుల్లో దేశ భక్తి గేయాలు వినబడుతున్నాయి.

ఉదయం 8 గం.లకు ఆకాశమంతా మబ్బులు వేసి చల్లని గాలి వీస్తోంది.

"ఏమోయ్! రా! రా! పిల్లలు జెండావందనం చేస్తున్నారు. మనం అక్కడికి వెళ్లాలి, ఆ శుభలగ్నం మనం కళ్ళార చూసి ఆనందించాలోయ్!" అంటూ భార్యను తొందర చేసారు.

"జెండావందనం చూద్దామని శుభలగ్నం అంటారేమిటండి" అంది ఆవిడ.

"అది శుభలగ్నం కాదా? దేశానికి, ఈ గ్రామానికి, మనలాంటి మానవులకి అంతకంటే శుభలగ్నమేమిటోయ్' మనందరికి స్వతంత్రం సిద్ధించిన శుభఘడియ అది" అన్నాడాయన. నిజమే! ఆవిడ ముసి ముసి నవ్వులతో మెట్లు దిగి ఆయన వెంట నడిచింది.

జానకిరామయ్యగారు ముందు నడుస్తుంటే భార్య శమంతగారు ఆయన వెనకే అడుగులేసింది. వారి వీధి చివర ఉన్న బడి చేరుకున్నారు ఇద్దరు. అప్పటికే పిల్లలందరు తెల్లని బట్టలలో బారులు తీరి నిలబడ్డారు. తెల్లని వారి చొక్కాలపై మూడు రంగుల చిన్ని కాగితపు జెండాలు పిన్నులతో పెట్టుకున్నారు. అందరి ముఖాల్లో ఆనందం కొట్ట వచ్చినట్లు కనబడుతోంది. ఎదురుగా అమర్చిన కుర్చీలో భార్యా భర్తలిద్దరు అందరితోపాటు కూర్చున్నారు.

పిల్లలందరు ముక్తకంఠంతో 'వందే మాతరం' అంటు పాడుతుంటే జానకి రామయ్య గారి ఒళ్ళు జలదరించింది. ఆవిడ ఒళ్ళు ఆనందంతో పులకరించింది. ముఖ్య అతిథి జెండా ఎగురవేసి స్వరాజ్యం ఎలా వచ్చిందో వివరించింది. తరువాత

'జనగణ మన అధినాయక జయహే' అంటు పిల్లలు, వచ్చిన పెద్దలు పాడుతుంటే ఆ ప్రాంతమంతా మారుమోగింది. జానకిరామయ్యగారు, భార్య శమంత గారు కూడా లేచి నిలబడి గొంతులు కలిపారు. తరువాత వారు పెట్టిన మిఠాయి ఉండలు, జిలేబి కూడా స్వీకరించి ఇంటికి చేరుకున్నారు. ఆ బడి నుండి రెండు ఇళ్ళు ఇవతలే జానికిరామయ్యగారి ఇల్లు. ఆ బడిలో గంటలు మోగితే వారింటికి వినబడతాయి. ఆ బడి గంటలంటే ఆ దంపతులకు ప్రాణం.

జానకిరామయ్యగారు, భార్య కూడా ఓ ప్రైవేటు సంస్థలో పని చేసి రిటైరయ్యారు. ఆయనకు మేనమామ కూతురే శమంతగారు. వారి తల్లిదండ్రులు, బంధువులు అందరు ఆకాలంలో స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలకు తెగించి దేశభక్తి ఆయుధంగా పోరాడిన వారే. సర్వం ఉద్యమానికి అర్పించిన వారే. ఈ దంపతులు వారికా అవకాశం రాలేదని బాధపడుతూ ఉంటారు.

ఇద్దరికి వెనకాల ఆస్తుల్లేవు. ఆ రోజుల్లో ఇద్దరు బి.ఏ. వరకు చదువుకుని ఉద్యోగాల్లో చేరారు. బడిలో చదువుకునే రోజుల్లో దేశభక్తి గేయాలు ఇద్దరు నేర్చుకుని ఎంతో శ్రావ్యంగా పాడేవారు. ఒళ్ళు జలదరించేవి ఆ నాయకుల చరిత్రలు వింటుంటే. ఎన్నో ఆశయాలతో ఉద్యోగాల్లో చేరారు. దేశాన్ని, జనాన్ని ఉద్ధరించాలనుకున్నారు. కాని వారి ఆశలు ఏవీ నెరవేరలేదు. అంతా లంచగొండితనం. ఏ పని కావాలన్నా రికమండేషన్ లేదా లంచం ఇవ్వాలిసిందే. ఇద్దరూ విసుగెత్తి పోయారు. ఎక్కడా నిజాయితీకి స్థానమే లేదు. ఆ ఊబిలోకి వారు జారకుండా జాగ్రత్తపడ్డారు.

ఎప్పటికీ ఆఫీసు పనులు, కేంపులు, మరో పక్క సంసార బాధ్యత. ఇద్దరు మగ పిల్లలు, ఇద్దర్ని చదివించారు. శతక పద్యాలు, భారత, రామాయణ కథలే కాదు దేశ నాయకుల చరిత్రలు చెప్పారు. నీతి, నిజాయితీ గురించి బోధించారు. ఇద్దరు ఇంజనీర్లే. ఇన్నీ వొంటపట్టించుకున్నా వాళ్ళు అమెరికాకు పయనమై వెళ్ళారు. ఉద్యోగంలోను, సంసారంలోను మన ఆశయం నెరవేర లేదనుకున్నారు ఆ దంపతులు. కొడుకుల వివాహాలు కూడా వారికి నచ్చిన అమ్మాయిలతో జరిగిపోయాయి. ఇక ఇంట్లో భార్యా, భర్త ఇద్దరే మిగిలారు.

"శమంతా! జీవితంలో అలసిపోయాం! మన ఆశయాలు నెరవేర లేదు" అన్నాడు ఒకరోజు భార్యతో.

"ఆశయాలు నెరవేరడమంటూ ఉండదు! నెరవేరాలంటే నెరవేరాయి. లేదంటే లేదు. అంతేనండీ" అంది శమంత.

"నీ మాటలు నా కర్థం కాలేదు శమంతా!" అన్నాడు జానకిరామయ్య.

"అర్థం కాకపోవడానికేముందండీ! లంచాలు పుచ్చుకోకుండా ఉద్యోగాలు చేసాం! సర్వీసులో ఏ కేసులు లేకుండా రిటైరు అయ్యాం. ఇద్దరు కొడుకులకు విద్యాబుద్ధులు నేర్పించాం! పెళ్ళిల్లు చేసి ఓ యింటి వాళ్ళను చేసాం. పైగా మన తల్లిదండ్రుల్ని వదలి ఈ హైదరాబాదు వచ్చాం. కాలం మారిపోయింది. అవకాశాలు ఎన్నో వచ్చాయి. అందుకే మన పిల్లలు విదేశాలకు వెళ్ళగలిగారు. అంతకంటే ఏం కావాలండీ! మన బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చినట్టేగా" అంది ఆవిడ నవ్వుతూ.

"ఒక విధంగా నువ్వు చెప్పింది నిజమే! అప్పటి మన ఆలోచనలే నెరవేరాలంటే ఈ జీవితకాలం చాలదు" అన్నాడు ఆయన కూడా నవ్వుతూ.

ఉన్న యిల్లు అదే. పరిసరాలు అవే! కాని రిటైర్ అయిన తరువాత ఏదీ తోచని స్థితి వచ్చిందనిపించింది ఇద్దరికి.

"ఒకరోజు కామేశం దంపతులు వాళ్ళింటికి వచ్చారు. కామేశం జానకి రామయ్య గారి దగ్గర బంధువు.

"జానకిరామయ్యా! మేము తీర్థయాత్రలకు వెళ్ళాలనుకుంటున్నాం. మీరు కూడా వస్తే బాగుంటుంది. రిటైరయిన తరువాత కాస్త ఆధ్యాత్మిక దృష్టి కూడా అవసరమోయ్" అన్నాడాయన. జానకిరామయ్యగారికి, శమంత గారికి కూడా తోచడం లేదు. ఇద్దరూ ప్రయాణమయ్యారు.

ఒక మంచిరోజు చూసుకొని బయలుదేరారు. కాశీ, ప్రయాగ, గయ, బుద్ధగయ, త్రివేణి సంగమం చూసారు. అలహాబాదులో నెహ్రూగారి ఇల్లు చూశారు. అందరికి ఏదో సంతృప్తి అనిపించింది. అయోధ్యలో రామజన్మభూమి వివాద స్థలాన్ని చూసారు. హరిద్వార్, హృషికేశ్ చూసి అక్కడ తపస్సు చేసిన ఋషుల చరిత్రలు విన్నారు. మరోసారి కాశ్మీర్ అందాలు చూసి రావాలనుకుని తిరుగు ప్రయాణ మయ్యారు. కొన్నాళ్ళు ఇంటికి వచ్చిన వారందరికి అవే విషయాలు కథలు కథలు కింద చెప్పుకున్నారు. కామేశం దంపతులు తిరిగి వెళ్ళిపోయారు.

తిరిగి ఇంట్లో జానకిరామయ్యగారు, శమంతగారే మిగిలారు. కొడుకులిద్దరూ అమెరికా రమ్మనమని పట్టుపట్టారు.

"ఇంట్లో ఇద్దరు ఏం చేస్తారు? ఇక్కడకు రండి. మనవలతో కాలక్షేపం చేయవచ్చు రండి, రండి" అంటూ ఆహ్వానించి టికెట్లు పంపారు. నిజంగానే పిల్లల మీద మనసు మళ్ళింది. మనవలు కళ్ళలో మెదిలారు. దంపతులిద్దరు

ప్రయాణమయ్యారు. మొదటిసారి అంత దూరం విమానంలో వెళ్ళడం ఆనందంగాను, ఆశ్చర్యంగాను అనిపించింది. కొడుకుల్ని చూడగానే ఇద్దరి కళ్ళు దోసెడు కన్నీళ్ళతో నిండాయి. అక్కడ కొన్నాళ్ళు బాగానే అనిపించింది. మనవలు కూడా వదల్లేదు. గ్రాండు పేరంట్సు డేకి స్కూలుకి మనవలతో వెళ్ళారు. సరదాగా అనిపించింది. ఇద్దరు కొడుకులు చెరోచోట... కాలిఫోర్నియాలో ఒక కొడుకు, డెట్రాయిట్‌లో మరో కొడుకు ఉన్నారు. సాయం వేళ ఇంటికి వచ్చాక అందరు కలిసి షాపింగ్‌కి బయలుదేరి వెళ్ళేవారు. రాను రాను దాని మీద మోజు తగ్గింది. పిల్లలు వచ్చి తీసుకు వెళ్ళాలి కాని జైల్లో ఉన్నట్టే అనిపించింది. చుట్టు పక్కల ఎవరూ పలకరించరు. రోడ్ల మీద కార్లు తప్ప జనం కనిపించరు. ఎన్నోసార్లు దేవాలయాలకు వెళ్ళి వచ్చారు. ఇది మన దేశం కాదు. పరిసరాలు, వాతావరణం మనది కాదు అనే ఒక అభిప్రాయం ఆ దంపతుల మనస్సును తొలుస్తూనే ఉంది. 6 నెలలు ఉండి ఇక ఉండలేక ఇంకెప్పుడు అమెరికా వెళ్లకూడదనుకుని సొంత గూటికి చేరుకున్నారు.

ఇల్లంతా దుమ్ము దులుపుకుని సర్దుకున్నారు. సొంత యింట్లో ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికీ కొందరు వృద్ధాశ్రమాలకు వెలుతున్నారు. జానకిరామయ్య గారికి, శమంతగారికి ఇంకా ఓపిక ఉంది. అప్పుడే ఆశ్రమాలకి వెళ్ళకూడదనుకున్నారు. మరి కాలక్షేపం ఏదైనా నిర్ణయించుకోవాలనుకున్నారు. ఒక రోజు పొద్దుటే ఇద్దరు వాకింగ్‌కి బయలు దేరారు. ఒక బడి ముందు పిల్లలు ఆడుకుంటున్నారు. వారిని చూడగానే ఆ దంపతులకి ముచ్చటనిపించింది. తరువాత బారులు తీరి నిలబడి ప్రార్థన చేసారు. బడి యూనిఫారంలో అందరు అప్పుడే విచ్చుతున్న మల్లె మొగ్గల్లా ఉన్నారు. గణ గణ బడి గంట మోగింది. పిల్లలందరు గబగబ లోపలికి వెళ్ళారు.

"శమంతా! ఆ బడి గంటలు ఎలా మోగుతున్నాయెూ చూసావా? అవి క్రమశిక్షణకు మారుపేర్లు! అంటే గంట కొట్టినప్పుడల్లా పంతుళ్ళు మారుతారు. వారి పాఠాలు చెబుతారు. పిల్లలు వింటారు. పుస్తకాల మీద రాస్తారు. గణ గణ చదువుతారు. ఆ బడిగంటలు జీవితాలకే మేలుకొలుపులు" అన్నాడు జానకిరామయ్యగారు.

"నిజమేనండీ! మనం కూడా ఇంకా నేర్చుకోవలసింది, చదువుకోవలసింది చాలా ఉంది! ఈ బడికి దగ్గరలో మన ఇల్లు ఉంటే ఆ పిల్లల్ని చూస్తూ కాలక్షేపం చెయ్యొచ్చు. పైగా వారిని కూర్చోపెట్టి సాయంకాలం వారికి పాఠాలు చెప్పవచ్చు. లెక్కలు చేయించవచ్చు. దేశభక్తిపాటలు నేర్పించవచ్చు. దేశ నాయకుల చరిత్రలు చెప్పొచ్చు. అప్పుడు మన జీవితం ధన్యమవుతుందండి! అంది. ఆవిడ మాటల్లో పట్టుదల ఉంది. అచంచల విశ్వాసముంది.

"శమంతా! నువ్వు చెప్పింది చాలా బాగుంది! నిజమే ఆ పెద్ద యిల్లు అమ్మేసి ఈ బడి పక్క చిన్నయిల్లు కొనుక్కుందాం! ఆ పెద్ద యింటికి చాకిరి చెయ్యలేక పోతున్నాం. పైగా అనవసరమైన సామాను అమ్మేద్దాం. ఇల్లు విశాలంగా ఉంటుంది" అన్నాడు. ఆ మాటలు ఆమెకు చాలా నచ్చాయి. ఆ రోజే ఇల్లు వెదకడం ప్రారంభించాడు. స్కూలుకి దగ్గరలోనే ఇప్పుడున్న ఇల్లు దొరికింది. ఆ రోజు ఆ దంపతుల ఆనందానికి అంతులేదు. పాత యిల్లు సామానుతో సహా అమ్మేసారు. ఇప్పుడు బడి పక్కనే కొత్త యిల్లు, కొత్త సామాను అవసరమైనవే కొనుక్కున్నారు.

వారు అనుకున్నట్లు బడిగంటలు వినబడుతున్నాయి. రోజు ఉదయం ప్రార్థన వేళ అక్కడకు భార్యాభర్తలిద్దరు వెళ్ళివస్తున్నారు. సాయంకాలం కొంతమంది పేద విద్యార్థులకు చదువు చెబుతున్నారు. జాతీయగీతాలు నేర్పిస్తున్నారు. పిల్లలకి బహుమతులు కూడా తెచ్చియిస్తున్నారు. ఇల్లంతా పిల్లలతో సందడిగా ఉంటోంది. ఆ దంపతుల కాలక్షేపానికి లోటే లేదు.

ఒక రోజు కామేశం గారు భార్యతో బయలుదేరి వచ్చారు. "జానకిరామయ్యా! ఈ ముసలితనంలో కొత్త యిల్లు, ఈ కొత్త సామాను ఇదేమిటయ్యా! ముసలితనంలో ఈ ముచ్చట్లేమిటయ్యా" అన్నారు నవ్వుతూ.

"నిజంగా ఇది ముసలితనం ముచ్చటే. ఆ పెద్ద కొంప చాకిరి చెయ్యలేక అలసిపోతున్నాం. పైగా తెలుసున్న వాళ్ళందరు తలో చోటికి వెళ్ళిపోయారు. ఈ బడిని, పిల్లల్ని వెతుక్కుంటూ ఇటు వచ్చాం. ఆ బడిగంటలంటే నాకు చాలా ఇష్టం. అవి జీవితానికి పాఠాలే కావు, క్రమశిక్షణ నేర్పే గుడిగంటలయ్యా". ఆ రోజుల్లా కామేశం గారు జానకిరామయ్య గారింట్లోనే ఉన్నారు. ఆయన భార్య ఒంటరివారే. పిల్లలు ముగ్గురు పెద్దవారై దూరంగానే ఉంటున్నారు. ఈ వాతావరణం ఆయనకి నచ్చింది. ఎదురుగుండా ఉన్న ఇంట్లో అద్దెకు దిగి అక్కడ ఉండాలనుకున్నారు. అంతలో బడిగంట మోగింది.

అదిగో చూసావా! ఆ గంట తథాస్తు అంది అన్నారు జానకిరామయ్య. అందరు చిన్నపిల్లల్లా పకపకా నవ్వుకున్నారు.

కథా నిలయం
శ్రీకాకుళం

చేతన-మాసపత్రిక, నవంబరు 2006.